



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.34 గం.
సహర్ : గురువారం ఉ : 4.46 గం.


ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా మొక్కజొన్న

కాసుల పంట

> భూపాలపల్లి జిల్లాలో 3,200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు
> అంతర పంటలతో రైతన్నలకు మరింత ప్రయోజనం
> ప్రత్యామ్నాయ ఆదాయ దిశగా అడుగులు
> కూరగాయలు, అరటి, బొప్పాయి, మిర్చి, మొక్కజొన్న, పత్తి సాగుతో లాభాలు

కాటారం, ఏప్రిల్ 2: ఆయిల్‌పామ్ సాగుకు ఆదరణ పెరుగుతోంది. విదేశాల్లో మాత్రమే పండే ఈ పంటకు మన రైతులు కూడా ఇక్కడ ప్రాధాన్యమిస్తున్నారు. పనిలో పని ఇందులోనే అంతర పంటలు వేసుకొని ఆదాయం గడిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, కర్బూజా, మిర్చి, అరటి, వేరుశనగ, బొప్పాయి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు సాగుచేస్తూ ప్రయోజనం పొందుతున్నారు. ఆయిల్‌పామ్‌కు ప్రభుత్వం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న పామోలిన్‌ను స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంతో జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాతే ఇది చేతికి రానుండగా ఈలోగా రైతులు అంతర పంటలు సైతం వేసుకుంటున్నారు.

భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. మూడేళ్లుగా సుమారు 1,200 మంది రైతులు 3,200 ఎకరాల్లో పండిస్తున్నారు. భూపాలపల్లి డివిజన్‌లో ఆయిల్‌పామ్ భారీ ఎత్తున సాగవుతోంది. కాటారం సబ్‌డివిజన్‌లో మూడేళ్లుగా సుమారు 600 ఎకరాల్లో సాగులో ఉంది. కాటారం, మహదేవ్‌పూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో సాగునీటి సౌకర్యం భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. కొన్నిచోట్ల మూడేళ్ల క్రితం సాగు చేయగా మరికొన్ని చోట్ల గతేడాది చేపట్టారు. డ్రిప్ సిస్టంతో మొక్కలకు సాగు నీరు అందిస్తూ పలువురు రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో చెట్లు ఏపుగా ఎదుగుతున్నాయి. ఒకట్రెండు చోట్లా ఆయిల్‌పామ్ చెట్లు గెలలు వేయగా అధికారుల సూచనల మేరకు రైతులు మొదటి మూడేళ్ల వాటిని తీసేసి నాలుగో ఏట నుంచి ఉత్పత్తి కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఆదాయం కోసం..

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన అనంతరం చెట్లుగా మారి కాపు వచ్చే వరకు నాలుగేళ్ల పడుతుంది. నాలుగేళ్లపాటు ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగుచేసుకోవచ్చు. ఈ క్రమంలో ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో పలువురు రైతులు వివిధ రకాల అంతర పంటల సాగు మొదలెట్టారు. కొంతమంది కూరగాయలు, ఆకుకూరలు, కర్బూజా, కీర దోస సాగుచేస్తుండగా, మరికొందరు అరటి, బొప్పాయి, వేరుశనగ, మిర్చి, మొక్కజొన్న, పత్తి తదితర వాణిజ్య, వ్యాపార పంటలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు రైతులు మాత్రం ఆయిల్‌పామ్ తోటలో కొద్దిపాటి భూమిలో తీగజాతి కూరగాయలు, అలసంద, కర్బూజా, ఆకుకూరలు, కొత్తిమీర పండిస్తున్నారు.

మరింత ప్రోత్సాహించాలంటున్నరైతులు

జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే టార్గెట్ ఉండగా ఉద్యాన శాఖ అధికారులు ఎంత అవగాహన కల్పించినా పలువురు రైతులు మొగ్గు చూపకపోవడంతో లక్ష్యానికి దూరంలోనే ఉండిపోయింది. అన్ని పంటలు సాగు చేస్తే 3 నుంచి 6 నెలల్లోనే దిగుబడులు వచ్చి ఆదాయం సమకూరుతుండగా దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్‌పామ్‌తో సాగు చేసిన నాలుగేళ్ల అనంతరం ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. కానీ ఏళ్లపాటు ఆయిల్‌పామ్ గెలలు ఉత్పత్తి కానుండటంతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం రానున్నప్పటికీ లక్ష్యం మేరకు సాగు కావడం లేదు. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతుల్లో అధికశాతం అంతరపంటలు వేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఎకరా ఆయిల్‌పామ్ పంట సాగుకు మెయింటెనెన్స్‌కు రూ.2,100, అంతరపంటల సాగుకు మరో రూ.2,100 చెల్లిస్తోంది. అన్ని రకాల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం మరింత ప్రోత్సహకాలు అందించాలని రైతులు కోరుతున్నారు. ఎకరాకు రూ.10వేలు సాయంగా అందిస్తే రైతులకు ప్రయోజనం కలగుతుందని అంటున్నారు. దీంతో మరికొందరు రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేయడానికి ముందుకొస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలిక ప్రయోజనం

- సంజీవరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుంది. నీటి సౌకర్యం ఉన్న భూముల్లో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. సుమారు మూడు దశాబ్దాలపాటు గెలలు వేయడంతో దీర్ఘకాలిక ఆదాయం పొందొచ్చు.


చింతకానిలో ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా వేసిన కూరగాయలు, కర్బూజా తోట

నిఘా పటిష్ఠం చేయాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం పంపిణీపై నిఘా పటిష్ఠం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఫ్లయింగ్ స్క్వా, వ్యయ నోడల్ అధికారులు, వీడియో సర్వేలెన్స్, వ్యూయింగ్, అకౌంటింగ్ , మానిటరింగ్ సెల్, కాల్ సెంటర్, స్టాటిక్ సర్వేలెన్స్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టర్, నోడల్ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అభ్యర్థుల ఖర్చులను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జరిగే సభలు, సమావేశాలపై దృష్టి పెట్టాలని, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల పంపిణీని నిశితంగా పరిశీలించి వాటి ఖర్చును అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలన్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు. సెక్టర్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. దీనికి సంబధించిన వివరాలను తహసీల్దార్లకు అందజేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఫామ్-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్డీవో మంగీలాల్, డీఎస్పీ సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలాలి..

- ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం..
- కాంగ్రెస్ మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేస్తారు..
- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను గెలిపించాలి..
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

7లో..


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

బీజేపీకే అధికారం కట్టబెట్టాలి


మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్

- కేంద్రంలో మళ్లీ సత్తాచాటాలి
- మూడోసారి కూడా మోదీ సర్కారే రావాలి
- గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి
- వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

వివరాలు 8లో..

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం


సమావేశంలో తన కూతురు కావ్యతో కలిసి మాట్లాడుతున్న కడియం శ్రీహరి

- బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు
- కేసీఆర్ అంటే గౌరవం ఉంది.. నమ్మకాన్ని వమ్ముచేయలేదు
- దండోరా ముసుగు తీసి మందకృష్ణ బీజేపీలో చేరాలి
- మీడియాతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7వ పేజీలో..

బీఆర్ఎస్‌ను నమ్మొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్

- ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయం
- పేదలకు సేవ చేయడానికే బీజేపీలో చేరా..
- మోదీ అడుగుజాడల్లో నడుస్తా..
- బీజేపీ మహబూబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్

8వ పేజీలో..

బిల్ట్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

యంత్రాలను తొలగిస్తుండగా చెలరేగిన మంటలు



ఫ్యాక్టరీ నుంచి ఎగిసిపడుతున్న పొగ, మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంగపేట, ఏప్రిల్ 2: ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. పదేళ్ల క్రితం మూతపడ్డ ఈ కర్మాగారంలోని యంత్రాలన్నీ తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు ఇటీవల ఐటీసీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపగా సానుకూలంగా స్పందించింది. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీలోని భారీ యంత్రాలను తొలగించే పనులు జరుగుతున్నాయి. గ్యాస్ కట్టర్లతో పనులు చేస్తుండగా మంగళవారం మధ్యాహ్నం మిరుగులు పడి మంటలు ఎగిసిపడ్డాయి. భారీగా పొగ వ్యాపించింది. సిబ్బంది వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి దూరంగా పరుగులు పెట్టారు. ములుగు, ఏటూరునాగారం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి నీళ్లుచల్లి మంటలను అదుపుచేశారు.

గంజాయి పట్టివేత

నలుగురు యువకుల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న కాటారం సీఐ, ఎస్సై

కాటారం, ఏప్రిల్ 2: గంజాయి రవాణా చేస్తున్న కేసులో నలుగురు యువకులను కాటారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం పట్టుకున్నారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యారం ప్రాంతంలో యువకులు గంజాయితో సంచరిస్తున్నారనే సమాచారం సీఐ నాగార్జునరావుకు అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఎస్సై అభినవ్ పోలీస్ సిబ్బందితో బయ్యారం క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లగా నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి వారు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 430 గ్రాముల ఎండు గంజాయి ఉన్న ప్యాకెట్లు పట్టుబడ్డాయి. కాటారం గ్రామానికి చెందిన మాడెం ప్రవీణ్ అలియాస్ చింటు, గంట పరిపూర్ణం, బయ్యారం గ్రామానికి చెందిన జగజంపుల విష్ణు, కొత్తపల్లి గ్రామానికి చెందిన సొదారి అనిల్‌గా గుర్తించారు. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి తాము వాడటంతోపాటు కాటారం చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై అభినవ్ వెల్లడించారు. వారి నుంచి రూ.12 వేల విలువ చేసే 430 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఆ యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. కాటారం ఎస్సై-2 హరిశేఖర్, పీసీలు లక్ష్మిరాజు, వేణు, లవన్, నాగరాజు, హెచ్‌జీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు : ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, ఏప్రిల్ 2: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక ఆవరణలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. రైతులు తమ పంటకు మద్దతు ధర సాధించడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి చెత్త, తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు లేకుండా శుభ్రపరచాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పంట తీసుకురావాలన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు తమ ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాకు లింకు చేసి తీసుకురావాలన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ కోసం సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం తమ వెంట తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో మౌలిక సౌకర్యాలను సరిచూసుకుని అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత రైస్‌మిల్లర్లకు కేటాయించాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతి, డీఏవో విజయ్‌చంద్ర, డీసీవో సర్దార్‌సింగ్, గిరిజన సహకార సంస్థ మేనేజర్ దేవా, స్థానిక తహసీల్దార్ రవీందర్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, గోవిందరావుపేట మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి, స్థానిక ఏఈవో జెస్సి రవికుమార్ రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ శబరీశ్, అధికారులు

ములుగు, ఏప్రిల్ 2: జిల్లాలో ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు నేర సమీక్ష సమావేశాలు నిర్వహించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి ఎస్పీ శబరీశ్, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో వర్టికల్స్‌పై దృష్టి సారించి నేర నియంత్రణకు కృషి చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఐడీ డైరెక్టర్ శిఖాగోయల్, మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్, మల్టీజోన్ -2 ఐజీ సుధీర్‌బాబు, ఏటూరునాగారం ఏఎస్పీ, ములుగు డీఎస్పీ రవీందర్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద
నగదు పట్టివేత


వాహనదారుల నుంచి నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ములుగు, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఏర్పాటుచేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత నగదును స్వాధీన పర్చుకొని సీజ్ చేశారు. ములుగు ఎస్సై ఎ.వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజులాగే మంగళవారం ఉదయం వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన బొలేరో వాహనాన్ని సోదా చేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సంజయ్‌సాహు వద్ద రూ.52,500, సోమేశ్వర్ కుమార్ వద్ద రూ.6800, మనిష్ కుమార్ వద్ద రూ.59,300 నగదు లభ్యమైంది. ఇదే సమయంలో అశోక్ లేలాండ్ టెంపో వాహనాన్ని తనిఖీ చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడానికి చెందిన ఎస్.కె.అజ్మద్ వద్ద రూ.లక్ష, పూనెం సంపత్‌కుమార్ వద్ద రూ.లక్ష నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధారాలు, ధ్రువీరణ పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

73 శాతమే బొగ్గు ఉత్పత్తి

అట్టడుగు స్థానంలో భూపాలపల్లి ఏరియా



కాకతీయఖని, ఏప్రిల్ 2: సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ఏరియాకు ఇచ్చిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో అధికారులు వెనుకబడ్డారు. అన్ని ఏరియాలతో పోలిస్తే భూపాలపల్లి అట్టడుగు స్థానంలో నిలిచింది. 2023-24లో భూపాలపల్లికి 49.40లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 35.85లక్షల టన్నులు సాధించింది. ఇంకా 28.50లక్షల టన్నుల బొగ్గును వెలికి తీయకుండానే ఆర్థిక సంవత్సరం ముగిసింది. నిర్దేశించిన లక్ష్యంలో 73శాతం బొగ్గు ఉత్పత్తిని అధికారులు సాధించారు. సింగరేణి అధికారులు ఓపెన్‌కాస్ట్ గనులపైనే అధిక దృష్టి సారించారని, అండర్‌గ్రౌండ్ గనులపైనా కాస్త శ్రద్ధ వహిస్తే యాజమాన్యం ఇచ్చిన లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఇల్లందు ఏరియా 109 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి మొదటి స్థానంలో నిలిచింది. కొత్తగూడెం, రామగుండం-3 107శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి రెండో స్థానం, 106శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి మణుగూరు మూడో స్థానంలో నిలిచాయి.

కొత్త టార్గెట్ ఇదే..

సింగరేణిలో 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 31న ముగిసింది. దీంతో యాజమాన్యం ఏరియాకు నూతన టార్గెట్ విధించింది. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు భూపాలపల్లి ఏరియాకు 49.60లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు. గనుల వారీగా కేటీకే-1వ గనికి 2.50 లక్షల టన్నులు, కేటీకే-5వ గనికి 2.50 లక్షల టన్నులు, కేటీకే-6వ గనికి 1.80లక్షల టన్నులు, కేటీకే-8వ గనికి 2.80లక్షల టన్నులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2కు 15లక్షల టన్నులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-3కి 25లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించినట్లు వివరించారు.

ఓపెన్ కాస్టులపైనే ఆధారం...

భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్, రెండు ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. ఏరియా సింగరేణి అధికారులు ఓపెన్‌కాస్ట్ గనులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని తెలుస్తోంది. అండర్‌గ్రౌండ్ గనుల నుంచి బొగ్గును ఉత్పత్తి చేసేందుకు అయ్యే ఖర్చు లాభాల కన్నా ఎక్కువ ఉండటమే ఇందుకు కారణమని పలు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. అయితే ఓపెన్ కాస్ట్‌లతోపాటు అండర్‌గ్రౌండ్ గనులపై దృష్టి పెడితే అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించి సింగరేణి వ్యాప్తంగా భూపాలపల్లి మొదటి స్థానంలో ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

అండర్‌గ్రౌండ్లపై చిన్నచూపు...

ఏరియా సింగరేణి అధికారులు అండర్‌గ్రౌండ్ గనులపై చిన్నచూపుచూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గనుల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కార్మికుల రక్షణే ప్రధానమని చెప్పే యాజమాన్యం అండర్‌గ్రౌండ్ గనుల్లో కాలం చెల్లిన ఎస్డీఎల్ యంత్రాలను నడిపిస్తున్నారని కార్మికులు అంటున్నారు. బొగ్గును వెలికి తీశాక ఖాళీ ప్రదేశంలో నింపేందుకు ఇసుక కొరత ఉందని, దానిని అధిగమించడంలో ఏరియా అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వస్తున్నాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన రామగిరి శ్రీనివాస్ (34) హనుమకొండ గోకుల్‌నగర్‌లో కిరాయి ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

● బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. ● మీడియా సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నిజాయితీ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితమే తన రాజకీయ ఉన్నతికి మూలమని, మూడు దశాబ్దాలకుపైగా తన రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేకుండా ఉన్నానని అందువల్లే అన్ని వర్గాల వారు తనను విశ్వసిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్‌లో తమ చేరికకు గల కారణాలు, బీజేపీ పాలన తీరు, బీఆర్ఎస్ నేతలు తనపై చేస్తున్న విమర్శలు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా ఆరోపణలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. వివిధ వర్గాల్లో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ రాజీపడకుండా ముందుకు వెళుతున్నానన్నారు. తన రాజకీయ ఉన్నతి కోసం ఎవరికీ అన్యాయం చేయలేదని, ఒకరి అవకాశాలను కొట్టి తన స్వార్థానికి ఉపయోగించుకునే చరిత్ర తనది కాదన్నారు. తానెప్పుడూ పదవుల కోసం వెంపర్లాడలేదని.. 1994లో తొలిసారిగా ఎమ్మెల్యే అయిన తరువాత కేబినెట్‌లో చోటు దక్కే వరకు ఆ విషయమే తనకు తెలియదని, ఇక ఎంపీగా గెలిచిన అనంతరం 2016లో కేసీఆర్ తనను పిలిచి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని గుర్తు చేశారు. 2024లో కాంగ్రెస్ పెద్దలు తనను పార్టీలోకి రావాలని కోరారని, బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఒక నాయకుడు కాంగ్రెస్‌లో చేరికకు రెండు నెలలుగా తిరుగుతున్నా పార్టీ చేర్చుకోవడం లేదని, కానీ అదే తనను పార్టీలోకి రావాలని కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవుల హక్కుల పరిరక్షణతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేరానన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎందరో పార్టీని వీడారని, వారందరినీ విడిచి తనొక్కడి విషయంలో మాత్రం కొందరు బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమన్నారు. తాను వారిలా సంస్కారం లేకుండా మాట్లాడలేనని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె పోటీచేస్తే మూడో స్థానమే అని ఆయన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

అనడమే నిదర్శనమన్నారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న దయాకర్‌రావు తన మనవరాలి వయస్సున్న యశస్వినీరెడ్డి చేతిలో ఓడిపోయినా సిగ్గు రాలేదని, బలుపు, అహంకార మాటలు తగ్గలేదని వ్యాఖ్యానించారు. ఇక నిప్పు తొక్కిన కోతిలా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. వాటిని నిరూపించాలని.. నిరూపిస్తే వాటిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ విసిరారు. లేదంటే జనగామ చౌరస్తాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బట్టలూడదీసి నిలబెట్టడం ఖాయమన్నారు. కొందరైతే తనను పండబెట్టి తొక్కుతామంటూ రెచ్చిపోతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి తొక్కి న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసి బీజేపీలో చేరాలని శ్రీహరి హితవు పలికారు. దళితులను హింసపెడుతూ, రిజర్వేషన్ల తొలగింపు కుట్రలు చేస్తున్న బీజేపీ పక్షాన ఆయన ఎలా చేరుతాడని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకువస్తే సరిపోతుందని, ఆ పని బీజేపీ పదేళ్లుగా ఎందుకు చేయడం లేదని మందకృష్ణ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తాను దళితజాతి పరిరక్షణకు కృషి చేస్తున్నానని, అంతేకానీ తన రాజకీయ స్వార్థం కోసం దళితవర్గాలనే కాదు.. ఏ వర్గాలకు అన్యాయం చేయలేదని పునరుద్ఘాటించారు. మంద కృష్ణ విధానాల వల్లే ఎంఆర్‌పీఎస్ ముక్కలైందని ఆరోపించిన కడియం శ్రీహరి.. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న తన బిడ్డ డాక్టర్ కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. తన వలే నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తుందని తాను హామీ ఇస్తున్నానన్నారు.

నమ్మకాన్ని నిలబెడతా : కావ్య

కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకంతో లోక్‌సభ టికెట్ కేటాయించడంపై డాక్టరు కడియం కావ్య అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పార్టీ పటిష్ఠతకు నిజాయితీగా కృషి చేసి అటు పార్టీ.. ఇటు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజుల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీబీఏ ఇతర డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 16 వరకు విద్యార్థులు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూమెంట్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. పరీక్షలు మేలో నిర్వహిస్తామని ప్రకటించారు.

రాజస్థాన్ కోట మోషన్ కాలేజ్‌లో ఉచిత బ్రిడ్జి కోర్సు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: రాజస్థాన్ కోట్ మోషన్ ఐఐటీ, నీట్ కాలేజ్‌లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా 35 రోజుల బ్రిడ్జి కోర్సును ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల హనుమకొండ బ్రాంచి చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణలో ఐఐటీ, మెడికల్ కోర్సులకు బేసిక్స్ కెరీర్ గైడెన్స్‌ను ఐఐటీ, నీట్ ఫ్యాకల్టీ బోధిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట నయీంనగర్‌లోని బ్రాంచిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నయీంనగర్ బ్రాంచిలో, 9703000850 ఫోన్‌నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

అనైతిక ప్రాక్టీస్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉక్కుపాదం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారిగా 19మంది నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ప్రకారం రూ.5లక్షల నగదు జరిమానాతోపాటు యేడాది జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఆయుర్వేదం, హోమియో, యూనాని విద్యను అభ్యసించి అల్లోపతి చికిత్స అందిస్తున్న ముగ్గురిపై కూడా ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. వరంగల్ నుంచి డాక్టర్ జి.సురేష్, రంగంపేట నుంచి డాక్టర్ బి.సాంబయ్య, శంభునిపేట నుంచి డాక్టర్ టి.సదానందంలపై ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంతరావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: కాకతీయ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: పద్మాక్షీ పాలీక్లినిక్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలోని తమ క్లీనిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతోపాటు టీఎస్‌హెచ్, టీ-3, టీ-4, జీఆర్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభం కలిగిన ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు గతంలో వాడుతున్న మందుల చిట్టీలను, రిపోర్టులను వెంట తీసుకొని రావాలని రఘు సూచించారు. ఉచిత వైద్యశిబిరంలో పాల్గొనే వారు సెల్ 9955996166, 9133893360 నెంబర్‌లలో ముందస్తుగా కాల్‌చేసి తమ నెంబర్‌ను రిజిస్టర్ చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు.

క్రూ కంట్రోల్ తరలింపును నిలిపివేయాలి

● లేదంటే ఆమరణ దీక్ష చేపడతా ● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3: కాజీపేట రైల్వే జంక్షన్ క్రూ కంట్రోల్ నుంచి క్రూ లింకుల తరలింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. తరలింపును బీజేపీ ఎందుకు అడ్డుకోవడం లేదని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని ఓ కన్వెన్షన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మా ట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందాలవల్ల కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట ప్రాంతంలో నగరంలో ఒక ముఖ్య భాగంగా ఉన్నా అభివృద్ధిలో వెనకంజలో ఉందన్నారు. ఇందుకు బీఆర్ఎస్, బీజేపీలే కారణమని దుయ్య బట్టారు. కోచ్ ఫ్యాక్టరీ తరలిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వ్యాగన్ పరిశ్రమ పనులు ఏమయ్యాయని ప్రశ్నిం చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో చూపించామని రాజేందర్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పశ్చిమలో రూ.2కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రూ.40లక్షల కోట్ల అభివృద్ధిగా చూపించారంటూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను విమర్శించారు. పదేళ్లలో పశ్చిమ అభివృద్ధిని విస్మరించి ప్రజలను మాయ మాటలు చెప్పి నమ్మించారన్నారు. వరంగల్ పశ్చిమలో వరదలతో ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఇందులో భాగం గా నయీంనగర్ బ్రిడ్జి, విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 5వతేదీన నయీంనగర్ బ్రిడ్జిని కూలగొట్టి కొత్తగా విస్తరణ పనులు చేపట్టనున్నట్ల వెల్లడించారు. రెండు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్టు చెప్పారు. పెద్దపెండ్యాల జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల వాహనాలు వంతెన పై నుంచి రాకపోకలు సాగించవచ్చన్నారు. రెండు నెలల్లో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి అవుతుందన్నారు. ఇక భద్రకాళి మాడ వీధుల నిర్మాణం చర్యలు కూడా అమల్లో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నేతల పాపాలే వారిని వెంటాడుతున్నాయని రాజేందర్‌రెడ్డి దుయ్యబట్టారు.


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్, భూకబ్జాలు ఇలా అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. కేసీఆర్ కుటుంబ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో దోపిడీ చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగునెలలు కాకముందే కేసీఆర్ కరువుయాత్ర పేరుతో విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. వర్షాకాలమే రాలేదు కరువు ఎక్కడిదని ప్రశ్నించారు. పశ్చిమలో ధరణి పేరిట భూ దందాలు, కబ్జాలు, అనేక అక్రమాలను ప్రజలే బయటపెడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరుపనున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ధరణి పేరిట భూముల స్వాహాతో పాటు బాలసముద్రంలో అక్రమంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, పీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, గుంటి కుమారస్వామితో పాటు బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, మానస రాంప్రసాద్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో పాటు చీకటి ఆనంద్, నాయిని లక్ష్మారెడ్డి, డాక్టరు శ్రవణ్, బంక సంపత్ యాదవ్, కార్తీక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను బదిలీచేసి వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖ లో కొన్నేళ్లుగా కొందరు అధికారులు విధులు నిర్వహించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇక్కడే పాతుకపోయిన అధికారులను వెంటనే బదిలీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ నాయక్, బాదావత్ భాస్కర్ నాయక్, నూనావత్ శ్రీనివాస్ నాయక్, జాటోతు బావుసింగ్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ నగరంలోని పలుచోట్ల బెల్టుషాపులపై దాడులు చేశారు. మంగళవారం నిర్వహించిన దాడిలో రూ.22వేల విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశాయిపేటలో రూ.8490, వడ్డెపల్లి రెండు ఇళ్లల్లో ఒకరి ఇంట్లో రూ.7300, మరొకరిఇంట్లో రూ.6420 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు.

'రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు'

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 2: ప్రభుత్వం రూ.2వేల నోట్లను రద్దు చేసి, గత సంవత్సరం అక్టోబరు వరకు మార్చుకునే అవకాశాన్ని కల్పించిందని, ఇంకా ఎవరివద్దనైనా రూ.2నోట్లు ఉంటే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం హైదరాబాద్‌లో మార్చుకోవచ్చని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేల వరకు మార్చుకొనే అవకాశం ఉందని, రీజినల్ కార్యాలయంలో నోట్లు మార్చుకునే వారు తమ బ్యాంకు అకౌంట్ వివరాలతో నోట్లను రీజినల్ కార్యాలయంలో అందించిన తర్వాత వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. పోస్టాఫీసుల్లో కూడా తమ బ్యాంకు అకౌంట్ పూర్తి వివరాలు, పోస్టాఫీసులో పూర్తి వివరాలతో నోట్లను అందజేస్తే మార్పిడి అనంతరం వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రూ. 20వేలకు మించి ఉంటే కేవైసీ సర్టిఫికెట్‌తో ఇతర వివరాలను రీజినల్ బ్యాంకు కార్యాలయంలో అందించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా రిజర్వు బ్యాంకుకు చెందిన 18 సెంటర్లు ఉన్నాయని ఏ సెంటర్‌లోనైనా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించిందని అన్నారు.

కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. నేరాల నియంత్రణలో భాగంగా రాష్ట్ర సైబర్ క్రైం సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆరు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వరంగల్‌లో ఒక స్టేషన్ ప్రారంభించారు. స్టేషన్‌ను ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్‌క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ సూచించారు. సైబర్ నేరానికి గురైన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కమిషనర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవిందర్, అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్‌లు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆటిజమ్‌పై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: ఆటిజమ్ ఏ విధంగా వచ్చిందో అనేది కాకుండా.. ఎలా జయించాలో తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. అంతర్జాతీయ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని మంగళవారం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని డైక్ కేంద్రంలో వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడియాట్రిక్స్, ఎంజీఎం ఆధ్వర్యంలో ఆటిజమ్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. పీడియాట్రిక్ విభాగంలో అనేక వసతులు ఉన్నాయని, వాటిని ఉపయోగిం చుకొని పిల్లల ఎదుగుదల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శేషుమాధవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే..

బల్దియా కాంట్రాక్టర్ల నిరసన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని, ఇదే విధంగా బిల్లుల విషయంలో జాప్యం చేస్తే ఆత్మహత్యలు తప్పవని బల్దియా కాంట్రాక్టర్లు అధికారులను హెచ్చరించారు. జీడబ్ల్యుఎంసీ కాంటార్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, ఎమ్డీ అదిల్ అమ్మద్ సంయుక్తంగా మాట్లాడారు. బల్దియాలో ప్రస్తుతం పైరవీకార్లకు, పర్సంటేజ్‌కార్లకే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని, తమ లాంటి వాళ్లకు బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. జనరల్ ఫండ్స్ బిల్స్ ఇప్పటివరకే తమకు రూ.20కోట్ల వరకు రావాలని 2024లో వివిధ రకాల పన్నులు వసూలు చేసిన రూ.76 కోట్లు ఏం చేశారని వారు ప్రశ్నించారు. సీఎంఏ బిల్లులు కూడా చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని ఇదేవిధంగా జరిగితే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. చాలామంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి బల్దియా అభివృద్ధి పనులు చేశామని, రోస్టర్ విధానం కాకుండా బడా కాంట్రాక్టర్లకు కొందరు అధికారులు అడ్డదారిలో బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. తమకే వచ్చే బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, తిరుపతి, దేవేందర్, రాజేంద్రప్రసాద్, బొక్క కుమారస్వామి, రవి, నాగరాజు, అప్పాల శ్రీనివాస్‌లతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.


నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

తుక్కుగూడ సభకు తరలాలి..

● ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 2: ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే కాంగ్రెస్ సభకు భారీగా తరలి.. విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ సభ విజయవంతానికి తగిన ప్రణాళికలు రూపొందించామని, ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి శ్రేణుల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ముఖ్య నేతల తరలింపు ఏర్పాట్లను సమీక్షించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సభలో అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొని లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆరు గ్యారంటీలను ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్యారంటీలను అమలు చేసి ప్రజాదరణ పొందుతున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిగా ఉండనుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం నెలకొంటుండగా బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ కావ్యకు పార్టీ శ్రేణులు అండగా నిలిచి భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు.

కాంగ్రెస్ పటిష్ఠానికి కృషి చేస్తా : కడియం

కాంగ్రెస్‌లో చేరాక తొలిసారిగా డీసీసీ భవన్‌కు వచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి.. కడియం శ్రీహరిని సన్మానించారు. మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణతో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో శ్రీహరిని సత్కరిస్తున్న నాయిని, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, తదితర నాయకులు

తుక్కుగూడ, లోకసభ ఎన్నికపై సమీక్ష

మీడియా సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు డీసీసీ భవన్‌లో సమీక్ష జరిపారు. తుక్కుగూడ సభకు వాహనాల సమకూర్పు, నియోజకవర్గాల వారీగా శ్రేణుల తరలింపు, నాయకులు బాధ్యతల విభజన తదితర అంశాలతో పాటు వరంగల్ లోక్‌సభ ఎన్నిక అంశాలను చర్చించినట్టు తెలిసింది.

24 గంటల విద్యుత్ అందించాలి

జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ములుగు, ఏప్రిల్ 2: రాష్ట్రంలోని రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండిన పంటలు, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని, రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేయాలని అన్నారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వరి పంటకు మద్దతు ధర ఇవ్వడంతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. జిల్లాలోని రైతులు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, చెరువులను నింపకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి పొట్ట దశకు వచ్చిన పంట పొలాలు పశువులకు మేతగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా కరెంటు కోతలు కూడా రైతులను ఆగం చేస్తున్నాయని, మోటార్లు కాలిపోతున్నాయని, అర్ధరాత్రి ఇచ్చే కరెంటుతో మోటార్లు పెట్టడానికి పోయి రైతులు విద్యుత్‌షాక్‌తో చనిపోతున్నారని అన్నారు. అన్నంపెట్టే రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, నష్టపోయిన రైతుకు ప్రభుత్వం మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తూ పూటకో మాట మాట్లాడుతున్నారని అన్నారు. అకాల వర్షాల మూలంగా, నీరందక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్య మురళి, పోరిక గోవింద్‌నాయక్, గొర్రె సమ్మయ్య, రమేష్‌రెడ్డి, లాలునాయక్, భిక్షపతి, ఓదెలు, కుమార్, చంద్రమౌళి, రాందాస్, రాణాప్రతాప్, రఘు, తిరుపతి, శ్రీనివాస్, ఖాసీం, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే అధికారం కట్టబెట్టాలి

వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

రేగొండ, ఏప్రిల్ 2: కేంద్రంలో బీజేపీకే మళ్లీ అధికారం కట్టబెట్టాలని ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో అరూరి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీ సత్తాచాటి మోదీ సర్కారు అధికారంలోకి రావడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. పేదల అభ్యున్నతి కోసం మోదీ సర్కారు విశేషంగా కృషి చేస్తోందని కొనియాడారు. వరంగల్ పార్లమెంట్ స్థానంలో కూడా పార్టీకి ఓటు వేసి తనను ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వరంగల్ బీజేపీ ఎంపీగా జంగారెడ్డి గెలిచాక ఇన్నాళ్లకు ఆ అవకాశం తనకు వచ్చిందని అన్నారు. వరంగల్ ఎంపీ స్థానాన్ని గెలుచుకొని ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. తనను గెలిపిస్తే భూపాలపల్లి జిల్లాను వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఓపెన్‌కాస్టు నిర్వాసితులకు నష్టపరిహారాన్ని అందించేలా ప్రభుత్వంపై పోరాటం చేస్తానని అన్నారు. రేగొండ మండల కేంద్రంలో బస్టాండు, సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం చేయిస్తానని అన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కోకన్వీనర్ ప్రసాదరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపన్న, క్రమశిక్షణ సంఘం సభ్యుడు రాజమౌళి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మొద్దు

బీజేపీ మహబూబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్



మాట్లాడుతున్న సీతారాం నాయక్

ఏటూరునాగారం, ఏప్రిల్ 2: బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మొద్దని బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. ఆ పార్టీ కనుమరుగయ్యే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల ముఖ్యనాయకుల సమావేశంలో సీతారాంనాయక్ మాట్లాడారు. పేదలకు సేవ చేయడానికి, నరేంద్ర మోదీ అడుగుజాడల్లో నడవడానికి తాను బీజేపీలో చేరానని అన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి ఎంతగానో కృషి చేశానని, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి పాటుపడ్డానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారని ఆరోపించారు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే పార్టీ నుంచి తాను బయటకు వెళ్లేలా కుట్రలు చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, బీజేపీతోనే ప్రజా సంక్షేమంలో సాధ్యమని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి బీజేపీ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ లక్ష్మణ్ నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ మూనుకు శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడీ రామరాజు నేత, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 2: మాదిగలకు ఎంపీ టిక్కెట్లు ఇవ్వడంలో కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు మండిపడ్డారు. భూపాలపల్లిలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాజుల భిక్షపతి మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు ఉండగా అందులో ఒక్కసీటు కూడా మాదిగలకు ఇవ్వలేదని విమర్శించారు. ఇది పూర్తిగా మాలల పార్టీగా మారిందని వ్యాఖ్యానించారు. మల్లికార్జున ఖర్గే మాలలకు మాత్రమే టిక్కెట్లు కేటాయిస్తున్నారని, రేవంత్‌రెడ్డి సైతం అదే బాటలో పయనిస్తున్నారని మండి పడ్డారు. మాదిగ అని చెప్పుకుంటూ రాజకీయ పబ్బం గడుపుతున్న కడియం శ్రీహరిని గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, సురేష్, భరత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ దీవెనలు ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఎమ్మెల్యే గండ్రను శాలువాతో సన్మానం చేస్తున్న గ్రామస్థులు

గణపురం, ఏప్రిల్ 2: రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆకాంక్షించారు. గణపురం మండలం ధర్మరావుపేటలో గౌడ కులస్థులు చేపట్టిన రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యే జీఎస్ఆర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఆ ఎల్లమ్మ తల్లి దీవెనలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నారగాని ఎల్లస్వామి, దూలం రమేష్, పాలకుర్తి తిరుపతి, శంకరయ్య, కొంరయ్య, రాయమల్లు, రాజేందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

చెల్పూరులో ఫ్లాగ్‌మార్చ్

గణపురం, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అవగాహన కల్పిస్తూ పోలీసులు చెల్పూరు గ్రామంలో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ పోలీసు బృందంతో సీఐ మల్లేష్, ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కవాతు చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా చూడాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో జరిగిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారికి వైద్యులు మెరుగైన వైద్యసేవలందించాలని, మండలంలో ఉండే ప్రాథమిక వైద్యకేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశావర్కర్ల పాత్ర కీలకంగా ఉంటుందని, ప్రజలకు ఆరోగ్యసూత్రాల విషయంలో అవగాహన పెంచేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, ఏటూరునాగారం వైద్యాధికారి సురేష్, ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్, రవీందర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగాలి

భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



మాటాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా ప్రజలు సహకరించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు కోరారు. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడుతండాలో భూపాలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రజల కోసం పోలీసులు ఎల్లవేళలా పని చేస్తారన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొంత మంది తండా వాసులు ఎస్సీ ఎస్టీ కేసుల్లో తప్పుడు ఫిర్యాదులు ఇస్తున్నారని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలు, నంబర్ ప్లేట్ లేని 10 ద్విచక్ర వాహనాలతోపాటు 35 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల పానకం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ డి. నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, సాంబమూర్తి, రవికుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్, టీఎస్‌పీఎస్సీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

కాటారం(మహదేవ్‌పూర్ రూరల్), ఏప్రిల్ 2: పలిమెల మండల కేంద్రంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు విస్తృతంగా మంగళవారం దాడులు నిర్వహించారు. పలిమెల ఎస్సై తమాషారెడ్డి సివిల్, టీఎస్ఎస్‌పీ పోలీసులతో కలిసి ఇళ్ల, పొలాల గట్ల పక్కన, చేలల్లో తనిఖీలు చేశారు. గుడుంబా తయారీకి పులియబెట్టిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 63 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న పలువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం గ్రామంలో గుడుంబా, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలు, యువత ఎలా నిర్వీర్యమైపోతుందో అనే విషయాలను ప్రజలకు అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు.

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 2: ఏజెన్సీ గ్రామాల్లోని ప్రజలు అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని కర్రవానిగుంపు గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం జరగగా ఎస్సై పాల్గొని మాట్లాడారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని, బడీడు పిల్లలను బడికి పంపించాలని సూచించారు. గ్రామస్థులెవరూ అడవి జంతువుల వేట కోసం ఉచ్చులు, కరెంటు తీగలు అమర్చి ప్రమాదాలకు కారకులు కావొద్దని, అలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత కోడిపందేలు, పేకాట వంటి వ్యసనపరులు కావొద్దని, సైబర్ నేరస్థుల వలలో పడి మోసపోవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'వలస గిరిజనేతరుల పట్టాలను రద్దు చేయాలి'

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 2: ఏజెన్సీ ప్రాంతంలో వలస గిరిజనేతరుల అక్రమ పట్టాపాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆలుబాక గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఆలుబాక జెడ్‌లో అనేకమంది వలస గిరిజనేతరులు అక్రమ పట్టాలు చేసుకున్నారని, వారిపై అధికారులు విచారణ చేపట్టి పట్టాలను రద్దు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో గిరిజనచట్టాలకు విరుద్ధంగా భూముల క్రయ, విక్రయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈసమావేశంలో నాయకులు కృష్ణబాబు, సాంబశివరావు, నేత్రనంద కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌పీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సతీష్



గణపురం, ఏప్రిల్ 2: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పొనగంటి సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ పార్టీ రీజనల్ ఇన్‌చార్జి మేకల సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపురం మండలం చెల్పూరుకు చెందిన పొనగంటి సతీష్ మీడియా ఇన్‌చార్జిగా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాధితురాలికి టీపీసీసీ కార్యదర్శి చేయూత



ఆర్థికసాయమందిస్తున్న సుగుణ

కాటారం, ఏప్రిల్ 2:మండలంలోని కొత్తపల్లి తండాలో సోమవారం ఇల్లు కాలిపోయిన తేజావత్ సరోజనను టీపీసీసీ మహిళా కార్యదర్శి ఆంగోత్ సుగుణ మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర ఐటీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు బాధితురాలికి దుస్తులతోపాటు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం ద్వారా సాయమందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఎంపీటీసీ విజయారెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలు సుశీల, గ్రామఅధ్యక్షురాలు రజిత, వసంత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్‌కు సెల్‌ఫోన్లు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 2: సైబర్‌క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేం దుకు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అదనపు డీజీపీ శిఖాగోయల్ ఆధ్వ ర్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ సైబర్ వారియర్స్‌కు సెల్‌ఫోన్లు, సిమ్‌లను అందజేసి మాట్లాడారు. సైబర్ వారియర్స్ టోల్‌ఫ్రీ నంబర్ 1930, ఎన్‌సీఆర్‌పీ (సైబర్ పోర్టల్)లో ఫిర్యాదు చేసిన బాధితులు వారి ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేస్తే వెంటనే ఆకాల్ సంబంధిత పోలీస్‌స్టేషన్ సైబర్ వారియర్‌కి వెళ్తుందని అన్నారు. దీని ద్వారా బాధితులకు తమ ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవడానికి సులభతరం అవుతుందని పేర్కొన్నారు. రాబోయేకాలంలో నేరాలన్నీ సైబర్‌క్రైంకు సంబంధించినవే ఉంటాయని, సైబర్ వారియర్స్ దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సైబర్ క్రైంకు సంబంధించిన సహాయం కోసం ఈ కింది పోలీస్‌స్టేషన్ల వారీగా బాధితులు సైబర్ వారియర్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ములుగు-8712657427, వెంకటాపూర్ (రామప్ప)-8712657418, పస్రా-8712657425, తాడ్వాయి-8712657426, ఏటూరు నాగారం- 8712657420, కన్నాయిగూడెం-8712657419, మంగపేట-8712657417, వాజేడు-8712657416, పేరూరు-8712657414, వెంకటాపురం(నూగూరు)-8712657415 నంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ములుగు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సందీప్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ యాసిన్, సిబ్బంది జహరుద్దీన్, శ్రీకాంత్, ఉమామహేశ్వర్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 2: మండలకేంద్రం శివారులోని కంకలవాగు బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంకలవాగు సమీపంలో అక్రమంగా ఇసుకను నిల్వచేశారనే సమాచారంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో సుమారు 120ట్రిప్పుల ఇసుక నిల్వ ఉందని, దాని విలువ రూ.లక్షా20 వేలు ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ మల్లయ్య, సర్వేయర్ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి : గండ్ర జ్యోతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లాలో రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి డిమాండ్ చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ భవేష్ మిశ్రాకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు జిల్లాలో ఉన్నా రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఐదు నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయం చేస్తున్నారే తప్ప మరమ్మతులు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఎండిపోతున్న పొలాలకు నీరు అందించాలన్నారు. ధాన్యం క్వింటాలుకు మద్దతు ధరపై రూ. 500 బోనస్ చెల్లించాలన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 15వేల పంటసాయంతోపాటు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గులాబీ ఎండా ఎగరాలి

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



కాటారంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కాటారం, ఏప్రిల్ 2: కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ స్థానంలో గులాబీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్యకర్తలను కోరారు. కాటారం మండల కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణితో కలిసి మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 100రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన పలు హామీలను ఎగ్గొట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కేదారి గీత, డివిజన్ అధ్యక్షురాలు రత్న సౌజన్య, నాయకులు జక్కు రాకేష్, జవ్వాజి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే..

మల్హర్ : రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ప్రజల అవసరాలను తీర్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన తాడిచర్లలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నంబర్ వన్ స్థానంలో నిలిపిందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపీటీసీ రావుల కల్పన, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, నాయకులు తాజొద్దీన్, యాదగిరిరావు, నాగేశ్వర్‌రావు, రమేష్, నర్సయ్య, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గొత్తికోయ మహిళ ప్రసవవేదన

గ్రామంలోనే కవలలకు జననం



గొత్తికోయ మహిళకు జన్మించిన కవలలు

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 2: మండల కేంద్రం శివారు తొర్రిచింతలపాడులో పురిటి నొప్పులతో సోమవారం అర్ధ రాత్రి బాధపడిన మడకం అడెమె అనే గొత్తికోయ మహిళ సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేకపోయింది. మండల కేంద్రానికి ఆ గ్రామం మూడు కిలో మీటర్ల దూరంలో ఉండటంతో ఆ సమయానికి రవాణా సౌకర్యం లేక ఆస్పత్రికి చేరుకోలేకపోయింది. ఈలోగానే ఇద్దరు కవలలకు ఆమె జన్మనిచ్చింది. ఆమె ప్రసవం గ్రామంలోనే జరగ్గా చుట్టుపక్కల మహిళలు సపర్యలు చేశారు. సమాచారం తెలుసుకున్న వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం ఏఎన్ఎంలు స్వప్న, కనకలక్ష్మి, ఆశాలతో కలిసి మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చేరుకుని ప్రసవం అనంతర సేవలను అందించారు. కవల పిల్లల ఆరోగ్యం కోసం పలు చర్యలు చేపట్టారు. బాలింతతోపాటు ఇరువురు నవజాత శిశువులను వైద్యాధికారుల బృందం పరీక్షించారు.పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ములుగు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. ఆయన వెంట ఆశా కార్యకర్తలు సౌజన్య, సంపూర్ణ, మాధవి, కవిత, ఇందిర, సరోజన ఉన్నారు.

సర్వాయి పాపన్న వర్ధంతి

చిట్యాల, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మండల కేంద్రంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సంఘం అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంఘం నాయకులు ఏరుకొండ గణపతి, గోపగాని కొమురయ్య, బుర్ర రవీందర్, బుర్ర రఘు, శ్రీనివాస్, మల్లయ్య, గాజర్ల సమ్మయ్య, కట్టగాని రామచంద్రు, ఉయ్యాల రమేష్, బుర్ర మురళి, రాయకొమురు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప): మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి గౌడసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు కోటగిరి సురేందర్, ఉపాధ్యక్షుడు పులి రమేష్, నాయకులు గునిగంటి శోభన్, పోశాల వీరమల్లు, బుర్ర సాంబయ్య, మునిగాల మహేందర్, దేశిని దేవేందర్, నరేష్, శివ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల, ఏప్రిల్ 2: మండలంలోని నవాబుపేట శివారు చలివాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నవాబుపేట శివారులో తనిఖీలు చేస్తుండగా ట్రాక్టర్ల డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం డ్రైవర్లు, ఓనర్లు శనిగరపు ఓదెలు, కాసగాని కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.